క్లుప్తంగా

ఇసుక రీచ్ పరిశీలన



అడ్డాకుల: మండలంలోని రాచాల శివారులో ఉన్న పెద్దవాగు ఇసుక రీచ్‌ను శుక్రవారం గనులశాఖ సహాయ సంచాలకుడు సంజయ్‌కుమార్‌తో కలిసి అదనపు కలెక్టర్ మోహన్‌రావు పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం ఉచితంగా ఇసుకను సరఫరా చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో స్థానిక వాగులో ఇసుక లభ్యతపై ఆరా తీశారు. లబ్ధిదారులు ఇంటి నిర్మాణం కోసం పంచాయతీ కార్యదర్శిని సంప్రదిస్తే మన ఇసుక వాహనం ద్వారా ఉచితంగా ఇసుకను తరలించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ శేఖర్‌కు సూచించారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

నవాబుపేట: సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఎస్ఐ విక్రమ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. సెల్‌ఫోన్‌లో అనవసర యాప్‌లను డౌన్‌లోడ్ చేయరాదన్నారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌లకు స్పందించడం, ఓటీపీలు చెప్పడం వంటివి చేయకూడదని సూచించారు. హెడ్‌కానిస్టేబుల్ సురేష్‌బాబు, సత్యం, నర్సింహ, నీలకంఠ, అమరేష్, బాలయ్య ఉన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లు

కోయిల్‌కొండ: మండలంలోని కొత్లాబాద్ పీహెచ్‌సీలో శుక్రవారం క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు మహమ్మద్ అబ్దుల్ షమీ, సబిత మాట్లాడుతూ.. క్షయ వ్యాధిగ్రస్తులు రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి పోషకాహార కిట్లు ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో సిబ్బంది వెంకటయ్య, మంజుల ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ/అడ్డాకుల: జిల్లా కేంద్రంలోని శ్రీనివాసకాలనీ చౌరస్తాలో శుక్రవారం సీనియర్ సిటిజన్స్ ఫోరం ఉపాధ్యక్షుడు తైలం బాలకృష్ణ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఫోరం సభ్యులు బాలయ్య, అనంతరెడ్డి, ఎ.రాజసింహుడు, సురేష్‌బాబు, రాములు, మనోహర్‌రావు, కోటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

■ అడ్డాకుల మండలంలోని కందూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో గ్రామానికి చెందిన ఉప్పల హనుమయ్య, పుష్పమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు మాజీ సర్పంచ్ ఉప్పల శ్రీకాంత్, రమేశ్ అంబలి కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కారెడ్డి సుదర్శన్‌రెడ్డి, గంగపూరి, శంకర్, శ్యాంసుందర్‌రెడ్డి, ఆకుల కృష్ణయ్య, రవీందర్, మారుతి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

రాజాపూర్(బాలానగర్): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన బాలానగర్ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ లెనిన్‌గౌడ్ వివరాల మేరకు.. దౌల్తాబాద్ మండలం బిచ్చాల్ గ్రామానికి చెందిన బడిగె గోపాల్ హైదరాబాద్ నుంచి ద్విచక్ర వాహనంపై జడ్చర్లకు వస్తుండగా.. పెద్దాయపల్లి శివారులో ఎదురుగా రాంగ్‌రూట్‌లో వచ్చిన టాటా సుమో ఢీకొట్టింది. ప్రమాదంలో గోపాల్‌కు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ఏనుగొండ ఎస్‌వీఎస్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. గోపాల్ బావమరిది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లు వెనక్కి తీసుకోవాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని ముస్లిం సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని పలు మసీదుల ఎదుట ప్లకార్డులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం సీఎంలు చంద్రబాబు నాయుడు, నితీశ్ కుమార్, నాయకులు చిరాగ్ పాశ్వాన్, జయంత్ చౌదరి దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లు తీసుకువచ్చి ముస్లింల మతస్వేచ్ఛను హరించేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఈ నల్ల చట్టాన్ని వెనక్కి తీసుకునే వరకు నిరసనలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో మిల్లీ మహాజ్ మహబూబ్‌నగర్ చీఫ్ ప్యాట్రన్ అన్వర్‌పాషా, కన్వీనర్ తఖీ హుస్సేన్, అబ్దుల్ జకీ, రఫీక్ అహ్మద్, ఖుద్దూస్ బేగ్, హాఫిజ్ ఇద్రీస్, నయిమ్ ఇమ్రాన్, ఖాలిద్ నవీద్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, సాదతుల్లా, జహంగీర్, అబ్దుల్ సమీ, ఇలియాజ్, అజహర్‌అలీ, అబ్దుల్ మక్సూత్, కలీం తదితరులు పాల్గొన్నారు.



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ డి.జానకి



దమగ్నాపూర్‌లో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి



టీజీఓ ఆధ్వర్యంలో..



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

పూలే జీవితం.. ఆదర్శప్రాయం



పీయూలో మాట్లాడుతున్న వీసీ శ్రీనివాస్



కలెక్టరేట్‌లో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ మోహన్‌రావు, అధికారులు

సాక్షి నెట్‌వర్క్: మహాత్మా జ్యోతిరావు పూలే జీవితం అందరికీ ఆదర్శనీయమని అదనపు కలెక్టర్ మోహన్‌రావు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

■ గొప్ప సంఘ సంస్కర్త పూలే అని ఎస్పీ డి.జానకి అన్నారు. డీపీజీ కార్యాలయంతో పాటు ఎస్పీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అదే విధంగా జిల్లా జనరల్ ఆస్పత్రిలో పూలే చిత్రపటానికి సూపరింటెండెంట్ సంపత్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

■ పూలే ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. చిన్నచింతకుంట మండలం దమగ్నాపూర్‌లో ఆయన పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అనీల్‌రెడ్డి, బాల్‌రాజు, శేఖర్ పాల్గొన్నారు.

■ జ్యోతిరావు పూలే వారసత్వాన్ని ముందుకు తీసుకుపోవాలని మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న అన్నారు. జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పూలే విగ్రహానికి పూలమాలలు వేశారు.

■ బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి పూలే అని టీజీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణగౌడ్ అన్నారు. టీజీఓ జిల్లా అధ్యక్షుడు ఎస్.విజయకుమార్, కార్యదర్శి కె.వరప్రసాద్ తదితరులతో కలిసి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

■ బీటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు పి.చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి బాలశంకర్ తదితరులు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా తెలంగాణ చౌరస్తాలో పండుగ సాయన్న సామాజిక సేవాసంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణముదిరాజ్, తెలంగాణ రజక రిజర్వేషన్ కమిటీ జిల్లా అధ్యక్షుడు శివన్న, సీపీఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్ తదితరులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

■ భారత సామాజిక విప్లవకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని మాలమహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి బైరి రమేష్ అన్నారు. మాలమహానాడు రాష్ట్ర కోఆర్డినేటర్ బ్యాగరి వెంకటస్వామి ఆధ్వర్యంలో ఆయన పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా మాదాసి, మదారి కురువ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పూలే జయంతి వేడుకల్లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాములు, గౌరవాధ్యక్షుడు శివన్న, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ బాలయ్య పాల్గొన్నారు. జై భీమ్ చౌరస్తాలో జ్ఞాన నీలి మెరుపు బహుజన మహనీయుల శోభయాత్ర కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు.

■ పాలమూరు యూనివర్సిటీలో మహనీయుల జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేష్‌బాబు, కన్వీనర్ ప్రవీణ, కోకన్వీనర్ కుమారస్వామి, ప్రిన్సిపాల్స్ మధుసూదన్‌రెడ్డి, రవికాంత్, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు. అదే విధంగా టీపీఆర్టీయూ నాయకులు శ్యాంబాబు, రమాకాంత్, శ్రీధర్, భూపతిసింగ్, భీంరెడ్డి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీటీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాఘవేందర్, ధనుంజయ, రాములు పాల్గొన్నారు. యూటీఎఫ్ నాయకులు రవికుమార్, వెంకటేశ్, ఉమాదేవి, భాస్కర్, కిష్టయ్య నాయక్, అజయ్, భాస్కర్ తదితరులు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

■ బడుగు బలహీన పీడిత వర్గాలకు అండగా నిలిచిన పోరాట యోధుడు పూలేకు భారతరత్న ఇవ్వాలని బీసీ సమాజ్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ సాగర్ డిమాండ్ చేశారు. బీసీ సమాజ్ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

■ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ డివిజన్ భవనం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కిల్లె గోపాల్, బి.చంద్రకాంత్, జి.రాజ్‌కుమార్, గాలెన్న, చిన్నికృష్ణ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా టీఎస్‌టీయూ భవన్‌లో పూలే, అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. కేవీఎన్‌పీఎస్, ఎస్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జె.చక్రవర్తి, ఎనుముల చైతన్యభారతి, నాయకులు గోవిందు, వెంకటయ్య, బండారి లక్ష్మయ్య పాల్గొన్నారు.

■ మిడ్జిల్‌లోని అంబేడ్కర్ భవనం వద్ద అఖిలపక్ష నాయకులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దేవయ్య, బుచ్చయ్య, గౌస్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

■ నవాబుపేట మండలంలో పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లింగం, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నీలకంఠం, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు శాంతయ్య పాల్గొన్నారు.

■ భూత్పూర్‌లో యాదవ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో వేదిక జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జుర్రు నారాయణ, దేవరకద్ర ఇన్‌చార్జి బత్తుల మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు.

■ దేవరకద్ర తహసీల్దార్ కార్యాలయంలో పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య, ఎంఈఓ బలరాం, ఆంజనేయులు, రాజు, ప్రదీప్ పాల్గొన్నారు.



మాలమహానాడు ఆధ్వర్యంలో..



బీసీ సమాజ్ ఆధ్వర్యంలో..



నవాబుపేటలో..



దేవరకద్ర తహసీల్దార్ కార్యాలయంలో

మహిళా సంఘాల బలోపేతం

• ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మహిళా సంఘాల బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మెప్మా ఆర్‌పీలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని శిల్పారామాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఎస్‌హెచ్‌జీలు తయారు చేసిన చేతివృత్తుల ఉత్పత్తులను అక్కడ విక్రయించుకోవచ్చన్నారు. తమ సహకారంతోనే మహబూబ్‌నగర్ ఫస్ట్ నవరత్నాలు కేంద్రంలో 240 మంది మహిళలు వివిధ ట్రేడ్లలో శిక్షణ పూర్తి చేసుకున్నారన్నారు. నగరంలోని యువత, నిరుద్యోగులకు అంబేడ్కర్ కళాభవన్‌లో ఎస్ఐ, కానిస్టేబుల్, వీఆర్‌ఏ, వీఆర్‌ఓ, టెట్, డీఎస్సీ తదితర పోటీ పరీక్షలకు ఉచితంగా శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. ఈనెల 16 నుంచి ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని, 90 రోజుల పాటు కొనసాగుతాయన్నారు. ఈ బ్యాచ్‌లో 700 నుంచి వేయి మంది వరకు నిరుద్యోగ యువతకు అవకాశం కల్పిస్తామన్నారు. అనంతరం ఆర్పీలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ సెంటర్ కోసం మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని మెప్మా భవనాన్ని ఆయన పరిశీలించారు. కాగా, టీడీగుట్ట ప్రాంతంలో తమ కోసం కమ్యూనిటీ హాల్ నిర్మించాలని ఆ ప్రాంత ఆర్‌పీలు ఎమ్మెల్యే దృష్టికితేగా భవన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కమిషనర్‌ను ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో ముడా చైర్మన్ కె.లక్ష్మణ్‌యాదవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, మెప్మా ఇన్‌చార్జ్ డీఎంసీ ఎం.లక్ష్మి, సీఓలు దేవమ్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఈద్గాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యెన్నం

ఈద్గాను అభివృద్ధి చేస్తాం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని ఈద్గాను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఈద్గా చుట్టూ రక్షణగోడ నిర్మాణంపై ఈద్గా కమిటీ సభ్యులు, అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, సాదుల్లా, శ్రీనివాస్ యాదవ్, ప్రవీణ్‌కుమార్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు ఖాజపాషా, రాషెద్‌ఖాన్ పాల్గొన్నారు.

అందరి సమ్మతితో మహనీయుల విగ్రహాల ఏర్పాటు

జడ్చర్ల టౌన్: జడ్చర్ల పట్టణంలో అందరి సమ్మతి మేరకు మహనీయుల విగ్రహాలను ప్రతిష్ఠింపజేస్తామని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి స్పష్టం చేశారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక సిగ్నల్‌గడ్డలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో త్వరలోనే కొత్త రెవెన్యూ డివిజన్‌లు ఏర్పాటు కానున్నాయని, అందులో జడ్చర్ల రెవెన్యూ డివిజన్ ప్రకటన రానుందని చెప్పారు. నవాబుపేట మండలంలోని కొల్లూరును మండలంగా ఏర్పాటుచేసే అవకాశం ఉందన్నారు. రాజాపూర్ మండలం ఈద్గాన్‌పల్లి వద్ద ప్రభుత్వ ఐటీఐ మంజూరుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధికి రూ. 70కోట్లు మంజూరు కానున్నాయని వెల్లడించారు. జడ్చర్ల, నవాబుపేట మండలాలకు రెండు 132 కేవీ సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయని తెలిపారు. బైపాస్ రోడ్డు విషయంలోనూ ప్రయత్నాలు చేస్తున్నట్లు వివరించారు. పట్టణంలో వరద సమస్య తీర్చేందుకు రూ. 14కోట్లతో మురుగు కాల్వల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, నాయకులు బాలవర్ధన్‌గౌడ్, కృష్ణయాదవ్, కోడ్గల్ యాదయ్య, రేణుక, జహంగీర్ పాల్గొన్నారు.



జడ్చర్లలో పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

ప్రశాంతంగా వేడుకలు జరుపుకోవాలి

చిన్నచింతకుంట: హనుమాన్ జయంతి వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్ఐ రాంలాల్‌నాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రాజకీయ పార్టీల నాయకులు, మత పెద్దలతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. శనివారం నిర్వహించే హనుమాన్ జయంతి వేడుకల్లో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో దశరథ్, మహిమూద్, వజీర్‌బాబు, వెంకటేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆందోళన

భూత్పూర్: మండలంలోని రావులపల్లిలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గ్రామంలోని బీసీ కాలనీలో రెండు రోజులుగా నీరు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. విషయాన్ని పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ విషయమై ఎంపీడీఓ ప్రభాకర్‌ను వివరణ కోరగా.. మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.



పేదలకు మెరుగైన వైద్యసేవలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ విజయేందిర వైద్యారోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీల వారీగా గర్భిణుల నమోదు, హైరిస్క్ కేసులు, కాన్పుల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. ముఖ్యంగా మాతా శిశు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పీహెచ్‌సీ స్థాయిలో మాతా శిశు సంరక్షణ, గర్భిణులకు పరీక్షలు, హైరిస్క్ కేసులకు చికిత్స తదితర అంశాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. అదే విధంగా రక్త హీనత ఉన్న మహిళలకు ప్రత్యేకంగా చికిత్స అందించాలని అన్నారు. టీబీ కేసులు ఎక్కువగా వస్తున్న ప్రాంతాలను గుర్తించి నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. టీకాల కార్యక్రమం వందశాతం సాధించాలని సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ కృష్ణ, జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.సంపత్ కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.శశికాంత్, మాతా శిశు సంరక్షణ ప్రోగ్రాం అధికారి డా.భాస్కర్ నాయక్ ఉన్నారు.

అధిక యూనిట్లు కేటాయించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: రాజీవ్ యువవికాసం పథకంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు అధిక యూనిట్లు కేటాయించాలని ఆల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లా కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజీవ్ యువ వికాస పథకంలో నిరుద్యోగులకు రాయితీ రుణాలు అందించి ఉపాధి అవకాశాలు కల్పించడం హర్షణీయమన్నారు. అదే విధంగా ఉర్దూ డిగ్రీ కళాశాలల్లో లెక్చరర్ల నియామకాలు చేపట్టాలని, ఉర్దూ మీడియం పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు. సొసైటీ కార్యదర్శి మహ్మద్ యాకూబ్, షాహెద్, సోహైల్ ఖాన్, మహబూబ్ అలీ ఉన్నారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ

మహమ్మదాబాద్: మండల కేంద్రంలోని అయ్యప్పకొండపై శుక్రవారం శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వాములు శ్రీనివాస్, రాజు, గోపాల్, బాల్‌రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా పడిపూజ కార్యక్రమంతో అయ్యప్పకొండ మార్మోగింది. స్వామివారికి అభిషేకం అనంతరం మహాపడిని వెలిగించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనంతయ్యగుప్తా, గోపాల్, నాయకులు కేఎం నారాయణ, విష్ణువర్ధన్‌రెడ్డి, రాములు, మాజీ ఎంపీపీ శాంతిబాయి, వైస్‌ఎంపీపీ రాధారెడ్డి, జితేందర్‌రెడ్డి, తహసీల్దార్ నాగలక్ష్మి, ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు వీరభద్రస్వామి రథోత్సవం

కోయిల్‌కొండ: మండలంలో ప్రసిద్ధిగాంచిన శ్రీవీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజున స్వామివారి రథోత్సవం, ఆదివారం అగ్నిగుండం మహోత్సవం, సోమవారం భద్రకాళిదేవి, వీరభద్రస్వామి కల్యాణం, పూర్ణాహుతి, నందికోళ్ల సేవ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకుడు తమళి విజయ్ తెలిపారు.

ఘనంగా ఏఐకేఎస్ ఆవిర్భావ దినోత్సవం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో శుక్రవారం అఖిలభారత కిసాన్ సభ (ఏఐకేఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ఎ.రాములు, జిల్లా కార్యదర్శి వై.లక్ష్మయ్య మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఏఐకేఎస్ కీలకపాత్ర పోషించిందన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు కావాలని అనేక ఉద్యమాలు చేసి రైతాంగానికి అండగా నిలిచామన్నారు. అన్ని రకాల పంటలకు బోనస్ కల్పించాలని, ఎరువులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భరత్, ప్రవీణ్, భాస్కర్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

హన్వాడ: మండలంలోని హనుమాన్‌పల్లి తండాకు చెందిన వెంకట్రాములు ఇసుకను అక్రమంగా జిల్లా కేంద్రానికి తరలిస్తుండగా.. పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

మహమ్మదాబాద్: ఆరుగాలం కష్టించి పండించిన పంటను దళారుల చేతుల్లో పెట్టి మోసపోవద్దని టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి రాములు, మండల అధ్యక్షుడు కేఎం నారాయణ రైతులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు మొకర్లాబాద్, గాధిర్యాల్ గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శాంతిబాయి, వైస్‌ఎంపీపీ రాధారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ముకుందం, గోపాల్‌రెడ్డి, ఏపీఎం సునీత, హన్మయ్య, శంకరయ్య, నారాయణ పాల్గొన్నారు.



గాధిర్యాల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

సద్వినియోగం చేసుకోవాలి

దేవరకద్ర రూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంజిల్ రెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని బస్వాపూర్, బస్వాయపల్లి గ్రామాల్లో శుక్రవారం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ కూలీల సమస్యలు పరిష్కరించాలి

మిడ్జిల్: ఉపాధి హామీ కూలీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీఓ గీతాంజలికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్ మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న కూలీలకు దినసరి కూలి రూ. 600లకు పెంచడంతో పాటు రెండెకరాల్లోపు ఉన్న కూలీలకు ఆత్మీయ భరోసా పథకం వర్తింపజేయాలని, పనుల్లో కొలతల విధానం రద్దు చేయాలని, సీనియర్ మేటీలను ఫీల్డ్ అసిస్టెంట్లుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యాదయ్య, జయరాములు పాల్గొన్నారు.